


"సరూ! ఏమిటింకా ఆలస్యం?" పేచీలు పెడుతూ జట్కాబండిలోంచి దిగజారిపోతున్న పిల్లల్ని దర్శీ ఆవటానికి తంటాలు పడుతూ కేకవేశాడు విశ్వం.

లోపల అత్తగారు చెబుతోన్న జాగ్రత్తలకి బుద్ధిగా తలవూపుతూ వింటోన్న సరోజ మగని కేకకి ఉలిక్కిపడింది.

"అలాగేనండి. మీరు చెప్పినట్టే చేస్తుంటాను." నమ్రతగా అంటూ వంగి ఆమె పాదాలు తాకి, "మరి మేం వెళ్లొస్తాం" అన్నది.

'కోడలింకా రాదేమో' అని వీధిగుమ్మంలోంచి లోపలికి తొంగిచూసిన వరంధామయ్యగారు, 'హు...నక్కవినయాలు' అనుకున్నారు వెగటుగా.

కానీ గుమ్మం దాటి కోడలు తనముందు కూడా వంగినప్పుడు చేత్తో తలతాకి, చెమరించిన కళ్లతో "దీర్ఘ సుమంగళీభవ" అని అప్రయత్నంగానే దీవించేశారు.

జట్కా ఏవేవో సామాన్లతో నిండిపోయింది. సరోజ పిల్లలిద్దరితోనూ ముందువైపు ఇరుగ్గా కూర్చుంది.

విశ్వం ఆఖరికి ఎక్కి కూర్చుని, "నాన్న వెనక వస్తారుగా... అమ్మా వెళ్లొస్తాం" అంటున్నాడు- వాళ్లకేసి చూడకుండానే- సామాన్లవీ సరిగా వున్నాయా ఏవీ పడిపోయే స్థితిలో లేవుకదా అనేది చూసుకుంటూ.

జట్కా సాయిబు 'ఛలో' అన్నాడు.

గుమ్మంలో నిలబడి కళ్లకడ్డం పడిన నీటితెర వెనకనించి కదిలిపోతున్న జట్కా వంకే చూస్తోంది పార్వతమ్మ.

లోపల ఏదో పేగుకదిలి మెలివేసి ఆరాటపెడ్తోంది.

"పిల్లలు జాగ్రత్త నాయనా- వెళ్లగానే ఉత్తరం రాయి. మరిచిపోకు" తపనగా అంటూ మెట్లు దిగి జట్కా వెనకే నాలుగడుగులు వేసింది.

"అలాగేలే. నువ్వెంకుండు" అన్నాడు విశ్వం. గుఱ్ఱం పరుగందుకుంది.

ఇక నిలబడలేనట్టుగా లోపలికి నడిచింది పార్వతమ్మ. సావిట్లో స్తంభానికి జార్లబడి కూర్చుండిపోయింది.

ఇందాకటి వరకూ గలగలలాడిన ఇల్లు ఇప్పుడు నీరవ నిశ్శబ్దంలో బావురుమంటోంది.

దిగాలుగా చుట్టూ కలియజూసింది పార్వతమ్మ.

ఒక మూలన తెగిన వైరు బుట్టలో మంచివన్నీ ఏరుకుపోగా మిగిలిన క్షతగాత్రుల్లాంటిఆటబొమ్మలు; దాని పక్కనే బుజ్జిగాడు తప్పటడుగులు వేస్తున్నప్పుడు కొన్న చెక్కబండి, గోడమీద వాడు పెన్సిల్‌తో రాసిన వచ్చీరాని ఓనమాలు; వాడికి నేనేమీ తీసిపోలేదన్నట్టు ఇంకో గోడమీద చిట్టితల్లి పూసిన కాటుక మరకలు; తిలకం మచ్చలు, మేకుకి వేలాడ్తున్న వెలిసిన రిబ్బన్ ముక్క, గూట్లో మనుమడు అగ్గిపెట్టెలో అపురూపంగా దాచుకున్న రంగు సుద్దముక్కలు, కిటికీలో మనుమరాలు తాటాకుబొమ్మకి చేసిన పెళ్ళి అలంకారం- ఎక్కడ చూసినా క్షణక్షణం తమ ముచ్చటలతో తననలరించిన తన మనుమల ఆనవాళ్లే.

నిట్టూర్చింది పార్వతమ్మ.

'ఇకనించీ ఇంట్లో ఆ చిన్నారి పెదవుల కిలకిలలు వినిపించవు. వెనకనించి వచ్చి కళ్ళు మూసే చిట్టి చేతుల మృదుస్పర్శలుండవు. మెడ చుట్టూ చేతులు చుట్టి జిలిబిలి పలుకులతో పూసులు చెప్పే ముచ్చటలుండవు. ఒళ్లోచేరి మారాంసాగించే మురిపాలుండవు. చిలిపి చేష్టల చిన్నెలుండవు. పక్కన పడుకుని, చెప్పే కథకు వూకొడ్తూ, ఓ కాలూ చెయ్యీ మీద వేసి నిదరపోయే ఆ పసివాళ్ళు తనకిచ్చే ఆలౌకికానందానుభూతి తనకిక అందదు.

'పొద్దు వాలిపోతున్న ఈ వయసున ఆ చిట్టిపావల సమక్షంలో, వాళ్ల ఆలనాపాలనలో, వారి అమాయకపు ప్రేమలో, బ్రతుకు పొడవునా పడ్డ శ్రమనీ, బరువుమోసిన అలసటనీ మరచి సేదదీరుతున్న తమకీ ఏకాంతవాస శిక్ష విధించటం న్యాయమా?'

'ఇక ఇలా వంటరిగా... శూన్యంగా గతకాలపు సంబరాలను తలచుకుంటూ బరువు బతుకీడుస్తూ...' కడుపులో రేగిన గుబులు తెరలుతెరలుగా రేగి బయటపడినట్టయి బావురుమన్నది పార్వతమ్మ.

సైకిల్ కోసం వరండాలో కొచ్చిన వరంధామయ్యగారికి భార్య రోదన చెవులకి సోకి, గుండె కలుక్కుమనగా ఒక్కక్షణం స్థబ్దుగా వుండిపోయారు.

మెల్లగా లోపలికి నడిచి భార్య తలమీద చేయివేశారు సముదాయింపుగా.

"రెక్కలొచ్చిన పక్షులు గూడునంటిపెట్టుకుంటాయా. పిచ్చిదానా! ఇది సహజం. ఎందుకు కుములుతావు?" అన్నారు ఓదార్పుగా.

ఏడ్వటం మూలాన ఎర్రబారిన కళ్లెత్తి చూసింది పార్వతమ్మ.

"మన సర్వస్వం దోచియిచ్చామే- మమతానుబంధాలు పెంచుకుని మన జీవితాలకు అర్థమే వాళ్లనుకున్నామే- రెక్కలొచ్చాయని ఇప్పుడు మీ పాట్లు మీరు పడండని వాళ్లెగిరిపోటం సహజమంటున్నారా మీరు? పక్షులకీ మనకీ ఏమీ తేడాలేదంటారా చెప్పండి..." జాలిగా అడిగింది.

ఏమనగలడు? మాట్లాడలేదు వరంధామయ్యగారు.

"రక్తం మాంసం పంచి కడుపారా బిడ్డల్ని కన్నాను. అరచేతిలో పువ్వుల్లా పెంచాం. ఆ బిడ్డలికి మన శక్తి సామర్థ్యాలూ, సంపదా ధారపోశాం. మన ఆశల్ని ఆశయాల్ని వాళ్ల చుట్టూరానే అల్లుకున్నాం. మనదంటూ మిగలకుండా సారమంతా జుర్రుకుని వాళ్లు చివరికి మనకు మిగిల్చిందేమిటి?" ఆవేదనగా తనలోతానే ప్రశ్నించుకున్నట్టన్నది పార్వతమ్మ.

"నాకు నిన్నూ నీకు నన్నూ " అన్నారు వరంధామయ్యగారు నిర్లిప్తంగా.

"వారి మీద నాలో పెల్లుబికే ప్రేమానురాగాల వెల్లువ తరగలేదే- వాళ్లకు సేవచేసే నా చేతుల్లో సత్తువ ఇంకా ఉడిగిపోలేదే- వాళ్ల శ్రేయస్సు కోసం నా హృదయమింకా పరితపిస్తూనే వుందే- ఎందుకండీ వాళ్లకి మనం వెక్కసమయిపోయాం- ఎందుకండీ వాళ్లు మన్నిలా దూరం చేసేశారు? ఊహూ- వాళ్లకు నేనక్కరలేకపోయినా వాళ్లు నాక్కావాలండీ- వాళ్లు లేందే నేను బతకలేనండీ..." హిస్టీరికల్‌గా తలమోదుకుంటూ విలపిస్తోంది పార్వతమ్మ.

ఇక ఆవిణ్ణి ఆ ఉధృతం తగ్గేవరకూ వంటరిగా వదలటమే బాగని తోచి సైకిల్ తీసుకుని బయటికు వచ్చేశారు వరంధామయ్యగారు.

తోవలో చలమయ్య మాస్టారు ఎదురయి ఆగి పలకరించారాయన్ని. వరంధామయ్యగారి కాయన బాల్యంనించీ స్నేహితుడు.

"విశ్వంకూడా వెళ్లిపోతున్నాట్టగా వరమం?" అని 'కూడా' అన్న దగ్గర వత్తుతూ.

"అవును" అన్నారు వరంధామయ్యగారు ఉదాసీనంగా.

మిత్రుడి ముఖకవళికలు గమనించకుండానే చలమయ్యగారు చెప్పుకుపోసాగారు.

"ఒరే వరమం! నువ్వనే వాడివి గుర్తుందా! 'నీకందరూ ఆడపిల్లలే- వాళ్ల పెళ్లిళ్లయి అత్తవారింటికి వెళ్లిపోతే నీ ఇల్లు ఖాళీ- నన్ను చూడు. మగపిల్లల తండ్రిని. కోడళ్లూ, మనవళ్లతో నా ఇల్లెప్పుడూ నిండే వుంటుంది.' అని ఉబ్బిపోయే వాడివి. ఇప్పుడేమంటావురా- నీకూ నాకూ తేడా ఏముందంటావు!". నవ్వుతూ స్నేహితుడి మొహంలోకి చూసిన చలమయ్యగారి కంఠం హటాత్తుగా ఆగిపోయింది. "నువ్వు బాగా అప్‌సెట్ అయినట్టున్నావు. ఈ రోజుల్లో ఆడపిల్లకీ మగపిల్లాడికీ భేదం లేదురా వరమం. ఎవరినీ మనకు మిగిలిపోతారని నమ్ముకోటానికి లేదు. అలా ఆశపడ్డం మన తెలివితక్కువే" సానుభూతిగా అన్నాడు తరవాత.

"అంతే... అంతే..." పేలవంగా నవ్వుతూ ముందుకు కదిలారు వరంధామయ్యగారు.

అలా సాగిపోతున్న వరంధామయ్యగారి ఆలోచనల్లో చలమయ్యగారి మాటలే మెదులుతున్నాయి.

అవును- ముగ్గురు కొడుకులకు తండ్రిగా తను ఎంతో మురిసిపోయేవాడు. అందరికీ చెప్పుకుని గర్వపడేవాడు. నాకేమని విర్రవీగేవాడు.

దానికి తగ్గట్టే తన స్థితిగతులు కూడా ఒక్కో కొడుకూ పుట్టినప్పుడల్లా నిచ్చెన మెట్లెక్కినట్టు పైపైకి చేరుకుంటూ వచ్చాయి.

పెద్దవాడు హరి పుట్టాక తను వ్యవసాయమే కాకుండా కొద్దిగా ధాన్యం కమీషన్ వ్యాపారం మొదలుపెట్టాడు. రానురానూ ఆ వ్యాపారం పుంజుకుంది.

అటు వ్యాపారమూ, ఇటు సొంతసేద్యమూ చూసుకోటం శ్రమ అనిపిస్తున్నావయసు ముమ్మరంలో అది లెక్క చెయ్యలేదు. "ఇంకెంత- నా కొడుకు అందివచ్చాడంటే వ్యాపారం వాడి చేతికిచ్చి నేను కమతం చూసుకుంటాను". అనేవాడు దిలాసాగా.

హరి తర్వాత పుట్టిన ఇద్దరూ మొగపిల్లలే అవటం, తన మిత్రులంతా "అదృష్టవంతుడివిరా- అన్నీ ప్లస్‌లే నీకు" అని పొగడ్డం తనకి ఏనుగెక్కించినట్టే అయింది.

మూడోవాడు విశ్వం పుట్టినప్పుడు, ఆడపిల్లకానందుకు కొద్దిగా అసంతృప్తి పడింది భార్య. తనకి మాత్రం ఏమీ అనిపించలేదు. పైగా, "వచ్చింది రాబట్టుకుని మూటాముల్లే సర్దుకు వెళ్లిపోయే ఆడపిల్లల కోసరం ఎందుకే కలవరిస్తావు- వీళ్లని చూడు. వీళ్లే మనల్ని ఒదలకుండా

